www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 27 అక్టోబర్ 2025

5

తిరుపతి



గజరాజులతో గ్రామాలు గజ..గజ..

ప్రజాశక్తి - చంద్రగిరి : చంద్రగిరి మండలం, చిన్న రామాపురంలో ఆదివారం తెల్లవారుఝామున 9 ఏనుగులున్న మంద గ్రామంలోకి ప్రవేశించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. తలుపులు మూసుకుని భయంతో వణికిపోయారు. గతంలో కొంగరవారిపల్లెలో ఉపసర్పంచ్ రాకేష్ చౌదరిని తొక్కి చంపిన ఘటన గుర్తు చేసుకుని ఆందోళన వ్యక్తం చేశారు. ఏనుగుల కదలికలపై నిఘా లేకపోవడంతోనే గ్రామంలోకి ప్రవేశిస్తున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనిశమడుగు వద్ద అడవి ఏనుగులు కదలికల్ని నివాసానికి అనుకూలంగా ఉండడంతో అక్కడే ఉంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అధికారులు ఏనుగుల వల్ల నష్టపోయాకే స్పందిస్తారా...? అని గ్రామస్తులుఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ, చంద్రగిరి సబ్ డివిజన్ డీఎస్పీ ఆదేశాల మేరకు చంద్రగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో పోలీసు, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ సిబ్బంది చంద్రగిరి మండలం చిన్నరామాపురం, భీమవరం, బి కొంగరవారిపల్లి పరిసర గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దండోరా వేయించారు.

జిల్లా అప్రమత్తం

- జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ పర్యటన
- సీనియర్ ఐఏఎస్ అధికారుల నియామకం
- నిండు కుండల్లా చెరువులు, జలాశయాలు
- పునరావాస కేంద్రాలు ఏర్పాటు
- ఉపాధి లేక కూలీల అవస్థలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తుఫాన్ నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం గూడూరు డివిజన్, కోట, వాకాడు



వరద ముప్పు ప్రాంతాల్లో చెరువులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్లు

మండలం, బాలిరెడ్డి పాలెం వద్ద గతంలో దెబ్బతిన్న కట్ట మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రస్తుతం కాకినాడ-విశాఖపట్నం తీరానికి దాదాపు 900 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. ఈ తుఫాన్ రానున్న రెండు రోజులలో ఉత్తర-పశ్చిమ దిశగా కదిలి, కాకినాడ సమీప తీరాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపిందన్నారు. ఈ తుఫాన్ ప్రభావంతో 27, 28, 29 తేదీలలో ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. సోమవారం సాయంత్రం నుంచి 29వ తేదీ వరకు ప్రజలు ఇంట్లోనే ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్, ఇంజనీరింగ్ శాఖలు సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో నాయుడుపేట, శ్రీకాళహస్తిలో ఎస్డిఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని, అలాగే మరో బృందాన్ని కూడా గూడూరులో ఉంచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఇంచార్జి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశి,ఇరిగేషన్ఎస్సీరాధాకృష్ణమూర్తి, గూడూరు, వాకడు మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తుపాన్ నేపథ్యంలో సీనియర్ ఐఏఎస్ అధికారి నియామకం
తిరుపతికి అరుణ్ బాబు.. చిత్తూరుకు గిరీష



అరుణ్ బాబు, గిరీష

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: ముందా తుఫాన్ తీవ్ర ప్రభావం నేపథ్యంలో ముందస్తు చర్యలుగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా రంగంలో దిగి తుఫాన్ నేపథ్యంలో రాష్ట్రంలో ఎటువంటి ప్రాణా, ఆస్తి నష్టం సంభవించకుండా జాగ్రత్తలు చేపట్టారు. ఆదివారం నుంచి గురువారం వరకు తుఫాన్ ప్రాబల్యం ఉన్న జిల్లాలకు హై అలర్ట్ ప్రకటించారు. జిల్లా కలెక్టర్ ఎప్పటికప్పుడు జాగ్రత్తలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వంలోని అన్ని శాఖల సమన్వయంతో అధికారులు పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. తుఫాన్ నేపథ్యంలో సముద్ర తీర్పు ప్రాంతంలోని మత్స్యకారులకు చేపల వేటకు నిషేధం విధించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరూ సెలవులు పెట్టకుండా విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో తుఫాన్ ప్రభావంతో ప్రత్యేక అధికారులను నియమించారు. జిల్లాల వారీగా ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది.- 19 జిల్లాలకు సీనియర్ల ఐఏఎస్‌లకు పర్యవేక్షణ బాధ్యత అప్పగించారు. తిరుపతి జిల్లాకు సీనియర్ అరుణ్ బాబు, చిత్తూరు జిల్లా కు గిరీషాలను నియమించింది. పశ్చిమగోదావరి నుంచి చిత్తూరు వరకూ జోనల్ ఇంఛార్జిగా ఆర్పీ సిసోడియా కూడా నియామకం జరిగింది.

నిండు కుండలా తిరుమల కొండ



పాపవినాశనం డ్యామ్ వద్ద టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు పూజలు

ప్రజాశక్తి - తిరుమల: గత కొన్ని రోజులుగా తిరుమలలో కురుస్తున్న వర్షాలతో జలాశయాలు నిండు కుండను తలపిస్తున్నాయి. నీటి నిల్వలు పూర్తిస్థాయికి చేరుకోవడంతో పాపవినాశనం డ్యామ్ వద్ద ఆదివారం టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించి గంగా హారతి సమర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ తిరుమలలోని జలాశయాలు 95 శాతం నిండిపోవడం శుభ పరిణామన్నారు. పాపవినాశనం, గోగర్భం డ్యామ్‌లు పూర్తిగా నిండిపోవడంతో గేట్లు తెరిచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. భక్తుల అవసరం కోసం తిరుమలలో ప్రతిరోజూ 50 లక్షల గ్యాలన్ల నీరు అవసరమవుతుండగా తిరుపతిలోని కళ్యాణి డ్యామ్ నుండి 25 లక్షల గ్యాలన్లు, తిరుమలలోని డ్యామ్‌ల నుండి 25 లక్షల గ్యాలెన్ల నీటిని వినియోగిస్తున్నామన్నామని తెలిపారు. తిరుమలలో 250 రోజులకు నీటి అవసరాలకు సరిపడే నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. డ్యామ్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నీటి అవసరాలను సక్రమంగా నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ శాఖను అభినందించారు. ఆదేవిధంగా టీటీడీ చరిత్రలో రికార్డుస్థాయిలో మొదటిసారి ఈ ఏడాది భారీ విరాళాలు వచ్చాయని తెలిపారు. గడిచిన 11 నెలల కాలంలో టీటీడీ ట్రస్టులకు రూ.918 కోట్లు విరాళాలు అందినట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సీఈ సత్య నారాయణ, ఈఈ లు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, సుధాకర్, శ్రీహరి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, వీజీవో సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అధికారులు జాగ్రత్త చర్యలు చేపట్టండి
: నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తుఫాన్ దూసుకొస్తున్న నేపథ్యంలో.. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ సూచించారు. ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలియజేశారు.

కళ్యాణీ డ్యామ్‌లో పెరిగిన నీటిమట్టం



ప్రజాశక్తి - చంద్రగిరి: కురుస్తున్న వర్షాలకు తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, కళ్యాణి నదిపై నిర్మిం చిన కళ్యాణి డ్యామ్‌లో నీటిమట్టం పెరిగింది. దీంతో పర్యాటకులను కళ్యాణి డ్యామ్ వద్దకు అధికారులు అనుమతించడం లేదు. 6 రోజుల ముందు 836 అడుగులు నీటి మట్టం ఉండగా.. ఆదివారం సాయంత్రానికి 868 అడుగులకు చేరింది. ఇలాగే మరో 2 రోజులు వర్షాలు కురిస్తే మరో 20 అడుగుల పైన నీరు చేరే అవకాశం ఉందని తిరపతి ఇరిగేషన్ అధికారులు తెలుపుతున్నారు. ఆదివారం సాయంత్రం అధికారులు కళ్యాణి డ్యాంని పరిశీలించారు.

శిథిలావస్థకు చేరుకున్న భవనం తొలగింపు

నగరంలోని గాలివీధిలో శిథిలావస్థకు చేరుకున్న భవనాన్ని ఆదివారం ఉదయం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తొలగించారు. గాలివీధిలోని షేక్ అన్వర్ బాషాకు చెందిన ఇల్లు శిథిలావస్థకు చేరుకుంది. వర్షాల నేపథ్యంలో కూలిపోయే అవకాశం ఉండడంతో కమిషనర్ ఎన్. మౌర్య ఆదేశాల మేరకు భవనం తొలగించేందుకు యజమానికి నోటీసులు ఇచ్చామని డిసిపీ ఖాన్ తెలిపారు. ఆదివారం ఉదయం ప్రొక్లైనర్ సాయంతో, పోలీసుల సహకారంతో, పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది కలసి చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలగకుండా తొలగించామని తెలిపారు. ఈ మూడు రోజుల పాటు మొంథా తుఫాను ఉన్న నేపథ్యంలో ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఏవైనా కూలిపోయే భవనాలు ఉన్నయెడల తమకు సమాచారం అందితే తొలగిస్తామని తెలిపారు. సహాయం కొరకు హెల్ప్ లైన్ నంబర్లు 0877-2256766, 99000822909 ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మధు, ప్లానింగ్ సెక్రటరి లు మానస, గిరిధర్, శరన్ రాజ్ తదితరులు ఉన్నారు.

పిజిఆర్ఎస్ రద్దు

మొంథా తుపాను కారణంగా జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం (పిజిఆర్ఎస్) రద్దు పరచడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు "మొంథా" తుఫాను కారణంగా సహాయకచర్యలలో ఉన్నందువలన ప్రజలెవ్వరికీ ఇబ్బంది కలగకుండా ఉండేందుకు సోమవారం నాటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా రద్దు చేశామన్నారు. ఈ అంశాన్ని ప్రజలందరూ గమనించి జిల్లా, రెవెన్యు, మండల కేంద్రాలకు వెళ్లరాదని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్), డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలు రద్దు చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పునరావాస కేంద్రాలు ఏర్పాటు

తుపాను నేపథ్యంలో తిరుపతి నగరపాలక పరిధిలో కమిషనర్ మౌర్య ఆధ్వర్యంలో పునరావస కేంద్రం ఏర్పాటు చేశారు. ఇందులో పార్వతి పురం, ప్రగతి నగర్ - పార్వతీపురం మునిసిపల్ స్కూల్, కెబిఆర్ నగర్ - తుడా క్వార్టర్స్ ప్రభుత్వ పాఠశాల, నవోదయ కాలనీ - కొత్తపల్లి ప్రైమరీ స్కూల్, ఆటోనగర్, గొల్లవాణిగుంట, పూలవాణిగుంట, కోరమేనుగుంట - రాజీవగాంధీ స్కూల్, కోరమేనుగుంట స్కూల్, ఆర్.ఎస్.ఇంగ్లీష్ మీడియం స్కూల్, రేణిగుంట రోడ్డు సచివాలయం, స్కావేంజెర్స్ కాలనీ, అబ్బన్న కాలనీ - మునిసిపల్ స్కూల్, ప్రియదర్శిని ఇంగ్లీష్ మీడియం స్కూల్, మధురనగర్ 33వ సచివాలయం, ఎర్రమిట్ట, సంజయ్ గాంధీ కాలనీ, శ్రీరామ్ నగర్ - మునిసిపల్ స్కూల్, జిల్లా పరిషత్ స్కూల్ సత్యనారాయణ పురం, తెల్లగుంట - డి-అడిక్షన్ సెంటర్, ఎర్రమిట్ట శివజ్యోతినగర్ - రత్నం స్కూల్, సత్యనారాయణపురం, సంజీవయ్య నగర్ - సింగాలగుంట మునిసిపల్ స్కూల్, ఉప్పంగి హరిజనవాడ, శ్రీనివాసపురం, రేణిగుంట రోడ్డు - ఉప్పంగి హరిజనవాడ మునిసిపల్ స్కూల్, యశోదనగర్ - లిటిల్ ఏంజెల్స్ హై స్కూల్‌లో ఏర్పాటు చేశారు.

అప్రమత్తంగా ఉండాలి : గూడూరు ఎంపిడిఓ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తుఫాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గూడూరు ఎంపిడిఓ మధుసూదన్ రావు పేర్కొన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో తుఫాన్ పై సమావేశం నిర్వహించి అధికారులకు తగు సూచనలు చేశారు.

అధికారులు సిద్ధంగా ఉండాలి : డిఎల్‌డిఓ

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): మంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవటానికి అధికారులు సిద్ధంగా ఉండాలని ప్రాంతీయ అభివృద్ధి అధికారిణి సుస్మిత సూచించారు. మండల కేంద్రంలోని స్థానిక ఎం.పీ.డీ.వో కార్యాలయంలో ఆదివారం డి.ఎల్.డి.ఓ సుస్మిత పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులు తగు సూచనలు చేశారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోండి
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తుపానుతో ఉపాధి కోల్పోయిన భవన నిర్మాణ రంగ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలోని భవన నిర్మాణ రంగ కార్మికులందరికీ నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, రూ.5 వేలు భృతిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల గృహాలను సైతం పరిశీలించి, దెబ్బతిన్న వాటి మరమ్మత్తులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

అవ్వ గుడిసెపై తుపాను దెబ్బ



తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల కు శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని వేలవేడు దళితవాడకు చెందిన వృద్ధ రాలు ఎం.సమితికి చెందిన పూరి గుడిసె కూలి పోయింది. గత పదిరోజులుగా కురుస్తున్న వర్షాలకు గోడలు నెమ్మెక్కగా శనివారం రాత్రి ఉన్నట్టుండి గుడిసె కూలి పోయింది. ఆ సమయంలో మెలుకువతో ఉండి ప్రాణాల తో బయట పడింది. ఒంటరినైన తనను ఆదుకోవాలని కోరింది.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

ప్రజాశక్తి - వాకాడు: తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం వాకాడు మండలంలో పర్యటించారు. స్వర్ణముఖి బ్యారేజ్‌ను పరిశీలించారు. వరద నీటి ప్రవాహం, ఆనకట్ట భద్రతా ఏర్పాట్లు, గేట్ల పనితీరు తదితర అంశాలను కలెక్టర్ సమీక్షించారు. సంబంధిత ఇంజినీరింగ్ శాఖ అధికారులతో కలిసి బ్యారేజ్ పరిస్థితిని అంచనా వేసి, అవసరమైన మరమ్మతులు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు.

చేపల వేటకు వెళ్లొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి - కోట: ఆదివారం కోట మండలంలోని దైవాల దిబ్బ, దొరువు కట్ట వద్దన్న స్వర్ణముఖి నది పొర్లు కట్టలను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. ఈ ప్రాంతంలోని పొర్లు కట్టలు సక్రమంగా లేకపోవడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. స్వర్ణముఖి నది పొర్లు కట్టలను శాశ్వతంగా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. సముద్ర తీర ప్రాంత మత్స్యకారులు వేటకు వెళ్ళకూడదని తెలియజేశారు.

జంగాలపల్లి చెరువు పరిశీలన

ప్రజాశక్తి - ఏర్పేడు : తుపాను నేపథ్యంలో అధిక వరద ప్రవాహంతో కొట్టుకుపోయిన జంగాలపల్లి చెరువు రింగ్ బండ్‌ను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు పటిష్టత, సాగు భూములు, ప్రస్తుత పరిస్థితి గురించి ఇరిగేషన్ ఈఈ కేవీ శివ రెడ్డి, డిఈ ఆదినారాయణ నాయుడు, జేఈ జయకుమార్‌లతో చర్చించారు. అనంతరం మండలంలోని పల్లం చెరువును పరిశీలించి చెరువు నీటి నిల్వ సామర్థ్యం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పోలీస్ ఆయుధాల ప్రదర్శన



ఆయుధాల పనితీరును విద్యార్థులకు వివరిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "పోలీస్ ఆయుధాల అవగాహన ప్రదర్శన ఓపెన్ హౌస్" కార్యక్రమాన్ని పోలీస్ పెరేడ్ మైదానంలో జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ "పోలీసు శాఖలో ఉపయోగించే వివిధ రకాల ఆయుధాలు, భద్రతా పరికరాలు, కమ్యూనికేషన్ సిస్టమ్స్, ఫోరెన్సిక్ సామగ్రి వంటివి ఎలా పనిచేస్తాయో, అవి ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగిస్తామో, విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ఏడు రోజులపాటు జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించబడుతుందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు భద్రతా అవగాహన,ట్రాఫిక్ నియమాలు, మహిళా రక్షణ, సైబర్ సేఫ్టీ వంటి అంశాలపై ప్రత్యేక ప్రదర్శనలు, సదస్సులు, చర్చా కార్యక్రమాలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ అవగాహన ప్రదర్శనలో పోలీసులు వివిధ విభాగాల ఆధ్వర్యంలో ఎస్ఎల్ఆర్, ఇన్‌సాస్, 9ఎమ్ఎం పిస్టల్ వంటి ఆయుధాలు, డ్రోన్ పరికరాలు, బులెట్ ప్రూఫ్ జాకెట్లు, కమ్యూనికేషన్ సిస్టమ్స్, ఫోరెన్సిక్ సామగ్రి, స్నిఫర్ డాగ్ యూనిట్ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకటరావు, రవి మనోహర్ ఆచారి, శ్రీనివాస్ రావు, డీఎస్పీలు వెంకట్ నారాయణ, భక్తవత్సలం, చంద్రశేఖర్, ఆర్ఐలు, పోలీస్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ముద్దు కృష్ణ కుటుంబానికి
రూ.25 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: శ్రీ పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాల హాస్టల్లో ఆదివారం ఉదయం విధుల్లో ఉండగా కుక్‌గా పనిచేస్తున్న టి.ముద్దు కృష్ణ మృతి చెందడం బాధాకరమని, అతని కుటుంబానికి సిఐటియు తరపున ప్రగాఢమైన సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు సిఐ టీయూ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. విధుల్లో ఉండగా ఆవిరి ముఖానికి కొట్టడంతో అస్వస్థతకు గురైన వెంటనే గుండెపోటు వచ్చిందని తెలిపారు. వెంటనే ఆసుపత్రికి తరలించడంతో అప్పటికే మృతి చెందాడని పేర్కొన్నారు. డ్యూటీ సమయంలో పని ఒత్తిడి కారణంగానే ఇలాంటి మరణాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సిబ్బంది లేకపోవడం, ఒత్తిళ్ల కారణంతోనే మరణించాడని పేర్కొన్నారు. ఇప్పటికే నలుగురు విధుల్లో ఉండగానే గుండెపోటుతో మరణించారని గుర్తు చేశారు. దాదాపు పదిమందికి పైగా రిటైర్డ్ అయ్యారని, వారు చేసే పని సొసైటీ ద్వారా పనిచేస్తున్న సిబ్బందిపై పడుతున్న కారణంగానే మరణాలు సంభవిస్తున్నాయన్నారు. పని ఒత్తిడితో డ్యూటీ చేయలేక అల్లాడిపోతున్నారని, ఇష్టం ఉంటే చేయండి, లేకపోతే వెళ్లిపోండి అంటూ అధికారుల వేధింపులు ఎక్కువ అయ్యాయని తెలిపారు. ముద్దు కృష్ణ కుటుంబానికి 25 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని, వారి కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

13 ప్రైవేటు బస్సులు స్వాధీనం

- 27 బస్సులపై కేసులు నమోదు



స్వాధీనం చేసుకున్న బస్సులను మంగళం ఆర్టీసీ డిపోకు తరలించిన దృశ్యం

ప్రజాశక్తి తిరుపతి సిటీ, మంగళం : రవాణా శాఖ, పోలీసు శాఖ సంయుక్తంగా నిర్వహించిన కాంట్రాక్టు క్యారేజీ బస్సుల ప్రత్యేక తనిఖీలలో నిబంధనలు పాటించని 27 ప్రైవేట్ బస్సులపై కేసులను నమోదు చేసి, 13 ప్రైవేట్ బస్సులను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు. రవాణా శాఖ కమిషనర్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో తిరుపతి నగరంలో కాంట్రాక్టు క్యారేజీ బస్సులపై ప్రత్యేక నిఘా ఉంచి రవాణా శాఖ నిబంధనలు పాటిస్తున్నారా?, నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికుల భద్రతను విస్మరిస్తున్నారా అనే కోణంలో సాంకేతిక అంశాలు ఆయా బస్సులలో ఉన్నాయా అనే అంశాలపై తనిఖీలు నిర్వహించామన్నారు. శనివారం రాత్రి నుండి ఆదివారం ఉదయం వరకు హైదరాబాద్, బెంగళూరు, సేలం, మధురై, పాండిచ్చేరి, జబల్పూర్ నుండి వచ్చిన 13 వాహనాలపై కేసులు నమోదు చేశామన్నారు. ఫైర్ డిటెక్షన్, అలారం సిస్టం, సప్రెషన్ సిస్టం వాహనాలు లేని కారణంగా ఈ బస్సులను స్వాధీనపరచుకొని మంగళం ఆర్టీసీ డిపోకు తరలించమన్నారు. అగ్నిమాపక నియంత్రణ పరికరాలు, అత్యవసర ద్వారం ప్రతి వాహనంలో మోటారు వాహన నియమ నిబంధనలు పాటించే విధంగా ఏర్పాట్లు చేశారా లేదా పరిశీలించామన్నారు. ప్రయాణికుల భద్రతా దృష్ట్యా ఏప్రిల్ 2019 తర్వాత రిజిస్టర్ అయిన బస్సులకు ఎఫ్డిఏఎస్ ఉండాలని, అక్టోబర్ 2023 నుండి రిజిస్టర్ అయిన వాహనాలకు ఎఫ్డిఎస్ఎస్ తప్పక ఉండేలా బస్సు యజమానులు గుర్తించాలని రవాణా శాఖ అధికారి మురళీమోహన్ తెలియజేశారు. ఈ సంయుక్త తనిఖీలలో జిల్లా అదనపు ఎస్పి రవి మనోహరాచారి, నగర డిఎస్పి భక్తవత్సలం, సీఐ లు, మోటార్ వాహన తనిఖీ అధికారులు శ్రీనివాసరావు, మోహన్ కుమార్, ఆంజనేయ ప్రసాద్, ఆంజనేయ వర్మ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వద్దు



మాజీ ఎమ్మెల్సీ డా. గేయానంద్ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ రచించిన "పి పి పిపేరుతో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వద్దు" అనే పుస్తకాన్ని ఆదివారం యుటిఎఫ్ ఆఫీసు నందు ఆవిష్కరించినట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి సుంకర రెడ్డెప్ప తెల్పినారు. ఈ సందర్భంగా రెడ్డెప్ప మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించ వద్దని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర వ్యాప్తంగా రౌండ్ టేబుల్స్, కర పత్రాలు ,సమావేశాలు ద్వారా విస్తృతంగా ప్రజలలో ప్రచారం చేస్తున్నదని తెలిపినారు. ఈ క్రమంలోనే యుటిఎఫ్ ఆఫీసు నందు పై పుస్తకాన్ని ఆవిష్కరించారు.మెడికల్ కాలేజీలు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళితే దానితో పాటు కాలేజీ అనుబంధంగా ప్రారంభమయ్యే హాస్పిటలు కూడా ప్రైవేట్ పరమయతాయని చెప్పినారు.కాలేజీలను ప్రైవేట్ పరం చేయడంవలన ప్రజలు,మెడిసిన్ చేయాలనే విద్యార్థులు బాగా నష్ట పోతా రన్నారు. వైద్య విద్య.వైద్యము వ్యాపారమైతుందని, ఇప్పటికే ప్రజలు తమ చేతిలోనుంచి వైద్యానికి ఎక్కువ ఖర్చు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమములో జన విజ్ఞాన వేదిక నాయకులు బిర్లా నాయుడు, రఫీ యుటిఎఫ్ నాయకులు ముత్యాల రెడ్డి,మధు, రామ చంద్రా రెడ్డి, నాగరాజ,టీచర్లు, జెవివి కార్య కర్తలు పాల్గొన్నారు.

తెలుగు గంగ కాలువలో యువకుడు, బాలుడు గల్లంతు


- ఉబ్బలమడుగు సమీపంలో ఘటన

ప్రజాశక్తి - వరదయ్యపాలెం : వరదయ్యపాలెం మండలం ఉబ్బలమడుగు సమీపంలో గల తెలుగు గంగ కాలవలో షరీఫ్ అనే యువకుడు ..మరో ఆరేళ్ల బాలుడు మహిత్ గల్లంతయ్యారు. ఆదివారం సాయంత్రం కారు కడిగేందుకు కాలువ సమీపంలో గల ర్యాంపు వద్దకు వెళ్లి లోనికి దిగి కాలుజారి వారిద్దరు కాలువలోకి కొట్టుకు పోవడంతో వారి ఆచూకీ లభించలేదు. అటు వరదయ్యపాలెం, పోలీసు లు బీ ఎన్ కండ్రిగ మండలం పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. రాత్రి పూట గాలింపు చేయడానికి కాష్టం గా ఉండటంతో పోలీసులు వెనుతిరిగారు సోమవారం ఉదయం తెలుగు గంగా కాలువలోకి నీరును నియంత్రించి తదుపరి గాలింపు చర్యలు చేపడమని పోలీసులు తెలిపారు.



షరీఫ్ (ఫైల్ ఫోటో)

ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌కు
నాదెండ్ల ప్రశంసలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తిలో టిడిపి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కూటమి నేతలను అటు పాలన పరంగాను, ఇటు పదవుల పంపిణీ లోను అందరినీ ఏకతాటిపై నడిపిస్తూ ముందుకెళుతున్నారని మంత్రి నాదెండ్ల కొనియాడారు. ముక్కంటి ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం అనంతరం స్థానిక ఎస్ ఎస్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం జనసైనికులతో నాదెండ్ల సమావేశమయ్యారు. ఎమ్మెల్యే బొజ్జల పై ప్రశంసల వర్షం కురిపించారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం వివిధ ఆలయాలకు ధర్మకర్తలి మండలి నియమించిన విషయం తెలిసిందే..! అందులో భాగంగా ముక్కంటి ఆలయ పాలకమండలి సభ్యులుగా నియమితులైన టిడిపి, బిజెపి, జనసేన సభ్యుల ప్రమాణ స్వీకారానికి అన్నీ తానై నడిపించి పొత్తు ధర్మాన్ని పాటించారంటూ కొనియాడారు. జన సైనికులు సమిష్టిగా ఉంటూ కూటమి ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

సుధీర్ బాబుకు వీడ్కోలు పలికిన చక్రధర్

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి : ప్రముఖ టాలీవుడ్ హీరో సుధీర్ బాబును రేణిగుంట విమానాశ్రయంలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సుధీర్ బాబు తిరుమల వెంకన్నను దర్శించుకుని తిరిగి హైదరాబాద్ వెళ్లేందుకు రేణిగుంటకు రాగా చక్రధర్ ఆయనను కలిసి పుష్పగుచ్చం, ముక్కంటి తీర్థప్రసాదాలు అందజేశారు.

రహదారి ప్రమాదాల నివారణకు నిరంతర తనిఖీలు

వాహన చట్టాన్ని మీరితే జరిమానాలు తప్పవు.. ప్రయాణికుల భద్రతే లక్ష్యం: ఆర్టీవో మురళీమోహన్

ముఖా ముఖి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రోడ్డుపై ఎవరో చేసిన చిన్న పొరపాటుకి అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్న నేపథ్యంలో, వాహన చట్టాలను పటిష్టంగా అమలు చేస్తూ ప్రమాదాల నివారణకు ప్రత్యేక బృందాల ఏర్పాటుతో తనిఖీలను నిర్వహించాలని, హద్దులు మీరిన వారిపై భారీ జరిమానాలు విధిస్తామని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ స్పష్టం చేశారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై ప్రమాదాలు నిత్య కృత్యమవుతున్న నేపథ్యంలో ప్రాణ నష్టం జరగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి..? మితిమీరిన వేగంతో వాహనాన్ని నడిపితే వెంటనే రవాణా శాఖకు, పోలీసులకు ప్రయాణికులు సమాచారం ఇవ్వాలని ప్రజాశక్తి నిర్వహించిన ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రజాశక్తి: రహదారులపై వేగ నియంత్రణకు, వాహన వేగాన్ని గమనించి పరికరాలు ఉపయోగిస్తున్నారా?

ఆర్టీవో: సాధారణంగా రోడ్లపై అతివేగంగా వెళ్లే వాహనాల వేగాన్ని అంచనా వేయడానికి ఇంటర్సెప్టర్ వాహనం అవసరమని, ప్రస్తుతానికి రవాణా శాఖలో ఈ వాహనాలు అందుబాటులో లేని కారణంగా దూరం నుండి వాహన వేగాన్నీ గుర్తించడం, వాహన రికార్డులను పరిశీలించడంతో అపరాధ రుసుములు విధిస్తున్నాం.

ప్రజాశక్తి: కాంట్రాక్టు క్యారేజీ బస్సులలో ఏదేని ప్రమాదం జరిగితే ప్రాణనష్టం నివారించడానికి ఎలాంటి జాగ్రత్తలు, సూచనలు ఇస్తున్నారు?

ఆర్టీవో: తిరుపతి జిల్లా పరిధిలో తిరుపతికి వచ్చే కాంట్రాక్టు క్యారేజీ బస్సులు, తిరుపతి మీదుగా వెళ్లే కాంట్రాక్టు క్యారేజీ బస్సులలో మోటార్ వెహికల్ చట్టం ప్రకారం నిబంధనలకు అనుగుణంగా బస్సు లోపల ఏర్పాట్లు ఉన్నాయా. లేక వారి సౌకర్యార్థం నిబంధనలకు విరుద్ధంగా ఏదైనా ఏర్పాటు చేసుకొని ఉంటే వాటిని తొలగించాలని సూచిస్తున్నాం. కాంట్రాక్టు క్యారేజీ బస్సుల్లో 36 నుండి 45 మంది ప్రయాణికులు ప్రయాణించే విధంగా బస్సు లోపల తగిన ఏర్పాట్లు చేస్తుంటారు. ఈ క్రమంలో డ్రైవర్ వెనుక వైపుపై భాగంలో ఓ వ్యక్తి పడుకునేంతగా ఒక అమరికను తయారు చేస్తున్నారు. దీనిని తొలగించాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాం. ప్రమాదం జరిగితే తప్పించుకోవడానికి వీలు లేకుండా ఇటువంటి అదనపు ఏర్పాట్లు చేయడం నిబంధనలకు విరుద్ధం.

ప్రజాశక్తి: ప్రత్యేక తనిఖీలను ఇకపై ఎలా నిర్వహిస్తారు?

ఆర్టీవో: నిబంధనలకు విరుద్ధంగా రవాణా శాఖ నిబంధనలను అతిక్రమించే వాహనాలపై ఇకపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి భారీగా అపరాధ రుసుం విధించాలని నిర్ణయించాం. అందులో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా పరిమితి దాటి లగేజ్ లను తీసుకెళ్లడం, నిబంధనల ప్రకారం అగ్నిమాపక పరికరాలు, అత్యవసర ద్వారం కాంట్రాక్టు క్యారేజీ బస్సులలో ఉన్నాయా లేవా... ప్రతి ప్రయాణికుడికి వీటి గురించి తెలిపేలా తగిన సూచనలను నిర్వాహకులకు ఇప్పటికే చెప్పాం. ఈ నిబంధనలను పాటించకపోతే జరిమానాలకు గురికావాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాం. అలానే డ్రైవర్ల ప్రవర్తన, వాహనాల కండిషన్‌ను ప్రత్యేకంగా క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం.

ప్రజాశక్తి: బయటి రాష్ట్రాల రిజిస్ట్రేషన్తో ఎక్కువ భాగం కాంట్రాక్టు క్యారేజీ బస్సులు తిరుగుతున్నాయి? ఇందుకు గల కారణాలు తెలపండి?

ఆర్టీవో: వాస్తవానికి బయటి రాష్ట్రాలలో రిజిస్ట్రేషన్ పొందిన కాంట్రాక్టు క్యారేజీ బస్సులు హెూమ్ టాక్స్ లుగా 40 వేల నుండి 60 వేల వరకు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. నాగాలాండ్, ఒడిస్సా, పుదుచ్చేరి, డైయూ అండ్ డామన్, అరుణాచల్ ప్రదేశ్, మిజోరాం వంటి రాష్ట్రాలలో రిజిస్ట్రేషన్ పొందిన కాంట్రాక్టు క్యారేజీ బస్సులు ఆల్ ఇండియా పర్మిట్ పొంది దేశవ్యాప్తంగా తిరుగుతున్నాయి. తిరుపతికి వచ్చేటివి, తిరుపతి మీదుగా వెళ్ళే కాంట్రాక్టు క్యారేజీ బస్సులు 80 శాతంగా ఉన్నట్లు గుర్తించాం. మన రాష్ట్రంలో కాంట్రాక్టు క్యారేజీ బస్సులలో ఒక్కో సీటుకు త్రైమాసిక పనులుగా రూ.4000 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ట్రావెల్స్ నిర్వాహకులు బయట రాష్ట్రాల వాహనాలను ఆల్ ఇండియా పర్మిట్తో నడుపుతున్నారు. ఎలక్ట్రానిక్ ఎన్ఫోర్స్మెంట్ వస్తే రవాణా శాఖ నిబంధనలు పూర్తిస్థాయిలో అమలు అవుతాయని, వేగ నియంత్రణ నుండి వాహనాల పార్కింగ్ వరకు అపరాధ రుసుములు విధించబడడంతో వాహనదారులలో మార్పు తప్పక వస్తుందని ఆశ భావం వ్యక్తం చేస్తున్నాం.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మొంథా తుపాను పట్ల మండల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ తహశీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో వెంకటరత్నమ్మలు కోరారు. ఆదివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తుపాను నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులతో సమీక్ష నిర్వహించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి, అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. అత్యవసర మందులను ముందుగా సిద్ధం చేసుకోవాలని వైద్య శాఖను కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో షణ్ముగం రామ్, రెవెన్యూ ఎంపీడీవో సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్: నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని గూడూరు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని ఆదిశంకర కాలనీలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి, వారి వివరాలు సేకరించామన్నారు. రికార్డులు లేని టూ-వీలర్లు, 3 ఆటోలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పగడాల ప్రకాష్‌కు డాలర్స్ నివాళి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి రూరల్ మండలం, దుర్గసముద్రం గ్రామానికి చెందిన పగడాల ప్రకాష్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. సమాచారమందుకున్న తుడా చైర్మన్, టిటిడి బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి పగడాల ప్రకాష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఓబిసి డిమాండ్ల సాధనకు సహకరించండి


ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న జబ్బల శ్రీనివాసులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చట్టసభలలో ఓబీసీలకు, 33 శాతం బీసీ మహిళా రిజర్వేషన్ల వంటి డిమాండ్ల సాధనకు సహకరించాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను సౌత్ ఇండియా ఓబీసీ అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు కోరారు. శనివారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి నవంబర్ 12న విజయవాడలో నిర్వహించే ఓబీసీ సెమినార్ కార్యక్రమాలను ఎంపీకి వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తను కూడా ఓబీసీ పార్లమెంటరీ 20 మంది సభ్యులలో ఒకటినని, ఓబీసీ డిమాండ్ల సాధనకు తప్పక సహకరిస్తానని చెప్పారన్నారు. అంబికా లక్ష్మీనారాయణను ఘనంగా సత్కరించి జ్ఞాపకను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజా, సోమ, లింగమూర్తి, గొట్టూరు అనిల్, చిరుతల వినోద్ గౌడ్, ఆదిత ఓబీసీ నేతలు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం కార్యాలయం ముట్టడికి సిద్ధం కండి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారంకోసం, డిప్యూటీ సీఎం కార్యాలయం ముట్టడికి సిద్ధం కావాలని కార్మికులకు ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వదాల రమణ పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల జిల్లా కార్యవర్గ సమావేశం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కత్తిరవి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పథకాలు అందలేదని ప్రభుత్వానికి తెలియపరిచారు. కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సంవత్సరాలుగా గడిచిపోయినా, అధికారులకు, నాయకులకు వినతి పత్రాలు ఇచ్చినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను, కార్మికులకే అందే విధంగా సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 46వేల క్లెయిమ్స్ రిలీజ్ చేయాలని కోరారు. లేని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఇతర కార్మిక సంఘాలను కలుపుకొని భవన నిర్మాణ కార్మికుల సమీకరించి ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రాధాకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీరాములు, ఎండి రవి, కత్తిరవి, రవి, హరిబాబు, చంద్రబాబు, యోగి, కార్తీక్, సెల్వ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వర ఆలయ కమిటీ చైర్మన్‌ని సన్మానించిన పోట్లపూడి రాజేష్



ప్రజాశక్తి - నాయుడుపేట: శ్రీకాళహస్తీశ్వర ఆలయ కమిటీ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్‌ను టిడిపి నేత, ఎస్ జె. జెవెలర్స్ అధినేత పోట్లపూడి రాజేష్ ఘనంగా సన్మానించారు. కొట్టే సాయి ప్రసాద్ శ్రీకాళహస్తీశ్వర ఆలయ కమిటీ చైర్మన్‌గా ఇటీవల ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో ఆయనను పోట్లపూడి రాజేష్ ఆదివారం శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొట్టే సాయి ప్రసాద్‌కు పోట్లపూడి రాజేష్ శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

సిపిఐ పట్టణ కార్యదర్శి కాలేషా మృతి బాధాకరం

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు సీపీఐ పట్టణ కార్యదర్శి కాలేషా మృతి బాధాకరమని సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివ కుమార్ పేర్కొన్నారు. కాలేషా తుది శ్వాస వరకు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేశారన్నారు. గూడూరు పట్టణంలో పేదలకు నివేశ స్థలాల కోసం పోరాటంచేశారని గుర్తు చేశారు. ఆయనతో పాటు వెంకట రామిరెడ్డి, పుట్టా శంకరయ్య, మణి, అడపాలప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, వెంకట రావు, ఆర్.ఎస్. కె. జిలానీ భాషా, బి. వి రమణయ్యలు కాలేషాకు నివాళులర్పించారు.

మద్యం విక్రయాలపై కాకిగోల మానండి : నెలవల


ప్రజా సురక్ష యాప్ కరపత్రాన్ని విడుదల చేస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - నాయుడుపేట: కూటమి ప్రభుత్వం నాణ్యమైన మద్యాన్ని విక్రయిస్తుంటే వైసిపి నాయకులు ప్రజలను పక్కదారి పట్టిస్తూ అసత్య ప్రచారాలతో కాకిగోల చేస్తున్నారని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం విమర్శించారు. ఆదివారం పట్టణంలోని గాంధీ పార్క్ సెంటర్‌లో ఎక్సైజ్ సీఐ అరుణ్ కుమారి ఆధ్వర్యంలో జరిగిన సురక్ష యాప్ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పారదర్శకంగా నాణ్యమైన మద్యాన్ని సరసమైన ధరలకే విక్రయిస్తుందని తెలియజేశారు. వైసిపి అరాచకాలకు తెరపడిందని, కూటమి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని తెలియజేశారు. ప్రజా సురక్ష యాప్ ద్వారా పారదర్శకంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని తెలియజేశారు. గత పాలనలో కల్తీ మద్యంతో వేలకోట్ల రూపాయలు దోచుకోవడమే కాక వందలాదిమంది మద్యం ప్రియుల ప్రాణాలను బలిగొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, తెలుగుదేశం పార్టీ నాయకులు సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల.సుబ్బారావు, నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు జీవిఆర్ నాయుడు,తెలుగుదేశం పార్టీ నాయకులు,పలుకూరు.ముత్యాలయ్య, కాపులూరు చక్రపాణి,బల్లి ముత్యాలయ్య,పలువురు నాయకులు పాల్గొన్నారు.

యువతరం ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: వెంకటగిరి పట్టణంలో పేదలకు సేవ చేయాలనే దృఢ సంకల్పంతో యువతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని వెంకటగిరి సీఐ ఏవి రమణ పేర్కొన్నారు. వెంకటగిరి పట్టణం, రాణి పేట, మదర్ తెరిసా వృద్ధుల ఆనంద ఆశ్రమంలో యువతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోచర్ల నాగరాజు, మల్లిక దంపతుల కుమారుడు మోచర్ల మహిధర్ పదోవ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకల్లో వెంకటగిరి సీఐ ఏవి రమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వృద్ధులకు సిఐ చేతుల మీదుగా యువతరం ఫౌండేషన్ ద్వారా దుప్పట్లను పంపిణీ చేశారు. నిత్యవసర సరుకులను వితరణ చేశారు. గూడూరు మండలం, చెన్నూరుకు చెందిన మోచర్ల నాగరాజు యువతరం ఫౌండేషన్ ట్రస్టీ మెంబర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

చిన్నగొట్టిగల్లు చెరువు కాలువకు మరమ్మతులు


కాలువ మరమ్మతు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: స్థానిక నాయకులు క్లస్టర్ ఇంచార్జ్ కొట్టే శివకుమార్ ఎర్రావారి పాలెం మండలం, రెడ్డి చెరువు నుండి చిన్నగొట్టిగల్లు చెరువుకు వచ్చే సప్లై ఛానల్ పూడి పోయి చాలాకాలంగా చెరువుకు నీరు రాక రాకపోవడాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకువెళ్లారు. 20 ఏళ్ల కిందట ఎర్రావారి పాలెం మండలం, రెడ్డి చెరువు నుంచి 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నగొట్టిగల్లు చెరువుకు నీటిని సరఫరా చేసేందుకు పెద్ద కాలవలు నిర్మించారు. తలకోన అటవీ ప్రాంతంలో పడిన వర్షపు నీరు రెడ్డి చెరువుకు చేరుతుంది. అప్పటి టిడిపి ప్రభుత్వం కాలువలను నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. పది నుంచి 20 అడుగుల లోతుతో 15 అడుగుల వెడల్పుతో కాలువలను తీశారు. ఈ కాలువ ద్వారాచిన్నగొట్టి గల్లుచెరువుకు నీటిని తరలించారు. కొన్నేళ్లపాటు ఈకార్యక్రమం సక్రమంగా జరిగింది. అనేక చెరువులకు జలకళ సంతరించుకుంది. కానీ ప్రస్తుతం కాలువలో పూర్తిగా మట్టితో నిండిపోయి పెద్ద పెద్ద చెట్లతో పూడిపోయింది. దీంతో చుక్కనీరు కూడా రెడ్డి చెరువు నుంచి చిన్నగొట్టిగల్లు చెరువుకు చేరలేదు. ఈ ఏడాది ఈ ప్రాంతంలో సమృద్ధిగా వానలు పడుతున్నా రెడ్డి చెరువు నుంచి చిన్నగొట్టిగల్లు చెరువుకు నీరు చేరే పరిస్థితి లేకపోయిందని ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే కాలువను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి కాలువల మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఆదివారం నుండి పనులు ప్రారంభమయ్యాయి. ఐదు జెసిబిలు, హిటాచిలతో కాలువలు మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. ఆయకట్టదారులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే పులివర్తి నానికి, నాయకుడు కొట్టే శివకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వసుంధర జ్యువెలర్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి రేణిగుంట రోడ్డు హోటల్ బ్లిస్‌లో వసుంధర గోల్డె అండ్ డైమండ్స్ వారు ఏర్పాటు చేసిన రెండు రోజుల (26,27)జ్యువలరీ ఎగ్జిబిషన్‌ను తిరుపతి నగరపాలక మేయర్ డాక్టర్ శిరీష ఆదివారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జ్యోతి ప్రజ్వలన చేసి ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వసుంధర గోల్డ్ అండ్ డైమండ్ అంటే మనందరికీ తెలిసిన బ్రాండేనని, అందరికీ అందుబాటులో గోల్డ్ అండ్ డైమండ్స్ అందించడం వీరి ప్రత్యేకత అని పేర్కొన్నారు. విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్‌లలో బ్రాంచులు కలిగి ఉన్న వీళ్ల ప్రతి సంవత్సరం లాగానే తిరుపతిలో రెండు రోజులు జ్యువెలరీ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం నిజంగా ఆనందంగా ఉందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన కలెక్షన్స్ మహిళలను ఎంతగానో ఆకట్టుకుంటాయని తెలిపారు. ప్రజల అవకాశానికి చేర్చుకోవాలని ఆమె కోరారు. అనంతరం వసుంధర గోల్డెన్ అండ్ డైమండ్స్ వైస్ ప్రెసిడెంట్ శ్రీదేవి మాట్లాడుతూ తిరుపతి నగర ప్రజలకు అందుబాటులో మంచి మంచి కలెక్షన్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళలందరికీ నచ్చే విధంగా చిన్న కలెక్షన్ నుంచి పెద్ద కలెక్షన్స్ వరకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అంతేకాక విజయవాడ షోరూమ్ ప్రారంభించి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక లక్కీ డ్రా ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో రెండు లక్షల పైన కొనుగోలు చేసిన వారికి కూపన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. సోమవారం సాయంత్రం 7 గంటలకు నిర్వహించే లక్కీ డ్రా లో కూపన్ ద్వారా గెలుపొందిన వారికి డైమండ్ రింగ్ బహుమతిగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వసుంధర గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని స్థానిక బాలాజీ కాలనీలోని లక్ష్మీనారాయణ కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు వైసీపీ ప్రచార విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.హరిప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు సభ్యుడు మద్దిల గురుమూర్తి, తిరుపతి మాజీ శాసనసభ్యులు భూమన కరుణాకరరెడ్డి, ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ ఆర్. శిరీష ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతు మురళీధర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, నగర ప్రజలు, మేధావులు పెద్ద సంఖ్యల హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం : మంత్రి నాదెండ్ల మనోహర్



ప్రజాశక్తి - తిరుపతి సిటీ, టౌన్: జనసేన పీఏసీ చైర్మన్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నివాసానికి విచ్చేశారు. మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సాదర స్వాగతం పలికారు. అనంతరం పార్టీ నాయకులను, జనసేన కార్పొరేటర్‌లను, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణలను మంత్రికి పరిచయం చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్, నగర అధ్యక్షులు రాజా రెడ్డి లతో కాసేపు మంత్రి నాదెండ్ల వివిధ అంశాలపై చర్చించారు. పార్టీ బలోపేతం మనందరి బాధ్యతని మంత్రి నాదెండ్ల వారికి దిశానిర్దేశం చేశారు. జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు వార్డుబాట కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కు మంత్రి నాదెండ్ల సూచించారు. శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొనేందుకు మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బయలుదేరి వెళ్లారు.

రాయుడికి న్యాయం చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రాయుడు హత్య కేసులో అసలు దోషులకు కఠిన శిక్ష పడేట్లు చేసి న్యాయం చేయాలని రాయుడు సోదరి కీర్తి మంత్రి నాదెండ్లకు విజ్ఞప్తి చేశారు. మంత్రి నాదెండ్ల ఆదివారం శ్రీకాళహస్తికి వచ్చిన సంగతి తెలుసుకున్న కీర్తి ఎస్ ఎస్ కన్వెన్షన్ హాల్లో మర్యాదపూర్వక కలిశారు. తమకు జనసేన నుంచి కూడా ఎలాంటి సాయం అంద లేదని వివరించారు. స్పందించిన మంత్రి తప్పకుండా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

తిరుపతి అభివృద్ధికి కలిసి రండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి అభివృద్ధికి వైసీపీ కార్పొరేటర్లు కలిసి వస్తే స్వాగతిస్తామని, అలా కాక తమ స్వార్థ కుయుక్త రాజకీయాలకు గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనను వాడుకుంటే సహించబోమని రాష్ట్ర యాదవ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్, టిడిపి తిరుపతి పార్లమెంటు డివిజన్ అధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్ వైసీపీ నాయకులను హెచ్చరించారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశలవారీగా తిరుపతి అభివృద్ధికి అనేక ప్రణాళికలు రూపొందించిన పార్టీ టీడీపీ అని, గ్రేటర్ ప్రతిపాదనను, మాస్టర్ ప్లాన్ రోడ్లు ఇవన్నీ టీడీపీ ఆలోచనలే అన్నారు. కానీ దీనిని వైసీపీ తమ ఖాతాలో వేసుకోవడానికి యత్నించడం దారుణమన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల ప్రతిపాదన తీసుకొచ్చింది నరసింహ యాదవ్ అని మాజీ డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డి కౌన్సిల్ హాల్ లో చెప్పారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణ, సుబ్బు యాదవ్, పాటకం వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధి అంటే పౌరుల అభివృద్ధి: నాగేశ్వరరావు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దేశం పూర్తిస్థాయిలో అభివృద్ధి జరగాలంటే పౌరుల అభివృద్ధి ప్రథమంగా జరగాలని, అలాంటి అభివృద్ధికి దోహదపడే రిజర్వేషన్ల విషయంలో గడిచిన ప్రభుత్వాలు అనుసరించిన ద్వంద వైఖరి కారణంగా పౌరుల అభివృద్ధి కుంటుపడిందని ఓబిసి విద్యార్థి సంఘం నాయకులు నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా అత్యధిక జనాభా గలిగిన బీసీ సామాజిక వర్గానికి చట్టసభలలో తగిన ప్రాధాన్యత కల్పిస్తూ బీసీ రిజర్వేషన్లను కల్పించాలని దశాబ్దాల కాలంగా పోరాడుతున్నామని, ఐదు శాతం ఉన్న అగ్రవర్ణ పేదలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కేవలం ఆరు రోజుల్లో అమలు అయిన తీరును వివరించారు. గడపగడపకు బీసీ వాదం అనే కరపత్రిక ద్వారా ఓబిసి ప్రజలను చైతన్య పరుస్తామని స్పష్టం చేశారు.

పూల దుకాణాలు తొలగింపు

ప్రజాశక్తి - పాకాల: పాకాల మెయిన్ రోడ్డు పై ఉన్న పూల దుకాణాలను పాకాల ట్రైనింగ్ ఎస్సై హరీష్ ఆదివారం తన సిబ్బందితో కలిసి తొలగించారు. మెయిన్ రోడ్డు పై ఎన్నో సంవత్సరాలుగా రోడ్డు ప్రక్కన ఉన్న ఖాళీ స్థలం వెంబడి పూల దుకాణాలు ఏర్పాటు చేసుకొని సుమారు 10 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. అయితే దుకాణదారుల మధ్య పోటీ పెరగడంతో రోడ్డుపైకి పెంచుకుంటూ వాహన దారులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో స్పందించిన పాకాల పోలీసులు రోడ్డుపై అడ్డంగా ఉన్న దుకాణాలను తొలగింపు చేశారు. రోడ్డు విస్తరణ దృష్ట్యా మరో ప్రాంతంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవావలని సూచించారు.

దుబాయిలో సీఎంను కలిసిన సౌదీ ప్రవాస భారతీయులు

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిర మండలం, రవణప్పగారిపల్లెకు చెందిన సౌదీ అరేబియా ఎన్ఆర్ఐ టీడీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ వడ్లమూడి సారథి నాయుడుని శభాష్ అంటూ సీఎం చంద్రబాబు నాయుడు అభినందించారు. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం దుబాయిలో పర్యటనకు వెళ్లిన సీఎంను సౌదీ అరేబియాలో ఉన్న టీడీపీ ప్రవాస భారతీయులు కలిసారు. దుబాయ్‌లోని లెమేరీడియన్ హెూటల్‌లో తెలుగు ప్రవాస భారతీయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఈసందర్భంగా సీఎం విమాన చార్జీలు లక్షలు ఖర్చు పెట్టుకుని 2024 ఎన్నికలలో కూటమి అభ్యర్థుల విజయం కోసం హాజరై ప్రచారం నిర్వహించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఎన్ఆర్ఐ టీడీపీ గల్ఫ్ అధ్యక్షులు రావి రాధాకృష్ణ సౌదీ అరేబియా టీడీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ వడ్లమూడి సారథి నాయుడు చంద్రబాబును కలవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : డిసెంబర్ 31వ తేదీ నుండి జనవరి 4వ తేదీ వరకు జరుగు ఆల్ ఇండియా మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు పుత్తూరు నియోజకవర్గం నాయకులు వెంకటేష్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులతో కలసి ఆదివారం కరపత్రం విడుదల చేశారు. లేబర్ కోడ్లను అమలు చేయడానికి దేశ వ్యాప్తంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు వెనకంజ వేసినా, కూటమి ప్రభుత్వం అత్యాశతో కార్మికులను వెట్టి చాకిరి వైపు తీసుకెళ్తానని సిఐటియు నాయకులు ఆరోపించారు. 13 గంటల పని విధానాన్ని వ్యతిరేకించారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు నుండి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నరసింహులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయాన్ని లాభాపేక్ష లేకుండా అభివృద్ధిపరచాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. భక్తుల విరాళాలతో ఆలయ ప్రాంగణ విస్తరణకు పరిసర స్థలాలను కొనుగోలు చేయడం అభినందనీయమన్నారు. ఆలయ పాలకమండలి తొలి సమావేశం ఆదివారం సాయంత్రం చైర్మన్ మహేష్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరైయ్యారు. ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులు, పెండింగ్ బిల్లులు, ఉద్యోగుల సమస్యలపై ప్రధానంగా చర్చ జరిగింది. ఆలయానికి నెలకు మూడు లక్షలు ఆదాయం వస్తుండగా సిబ్బంది జీతభత్యాలకు పదకొండు లక్షలు వ్యయం అవుతున్నట్లు గుర్తించారు. వర్షాలకు గర్భాలయం పై పడే వర్షపు నీరు ఆలయంలోకి వస్తుందని దీని వల్ల భక్తులకు ఇబ్బందిగా ఉందని ఈఓ జయకుమార్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వర్షపు నీరు ఆలయంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని సమావేశం నిర్ణయించింది. కాగా టిటిడి నుంచి ఇద్దరు వేదపారాయణులు ఆలయంకు వచ్చారని గత కొంత కాలంగా వారు ఆలయానికి రావడ లేదని చెప్పారు. టిటిడి ఉన్నతాధికారులతో మాట్లాడి వేదపారాయణులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

వైసిపి ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్(తొట్టంబేడు): మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి సూచనల మేరకు, వైద్య కళాశాలలను ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైయస్సార్సీపి ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆదివారం వైయస్సార్ పార్టీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు తొట్టంబేడు పంచాయతీలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు డాక్టర్ కోగిల సుబ్రమణ్యం, కోవి చంద్రయ్య నాయుడు, శ్రీరాములు రెడ్డి, రవీంద్ర నాయుడు, వైయస్సార్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఆర్టీసీ బస్సులో బంగారం, నగదు పోగొట్టుకున్న మహిళ


నీలమ్మ

ప్రజాశక్తి నాగలాపురం: కూతురు ఇంటికి వెళ్ళి తిరిగి ఇంటికి వస్తుండగా ఆర్టీసి బస్సులో 3 సవరములు బంగారం, 5 వేలు నగదు ఒక మహిళ పోగొట్టుకున్న ఘటన చోటుచేసుకుంది. వివరా ల్లోకి వెళితే నాగలాపురం మండలం, వెళ్ళూరుకు చెందిన నీలమ్మ (62) శనివారం ఉదయం తమిళనాడులోని తిరువళ్ళూరులో నివాసం ఉంటున్న తన కూతురు ఇంటికి వెళ్ళింది. తిరిగి ఆదివారం ఉదయం తిరువళ్ళూరు నుండి బస్సులో నాగలాపురానికి బయలు దేరింది. తిరుగు ప్రయణంలో ఊత్తుకోట్టై నుంచి నాగలాపురానికి ఆర్టీసి బస్సు ఎక్కి ఉచిత ప్రయాణం కొరకు ఆధార్ కార్డును కండెక్టరుకు చూపించింది. కారణి వరకు బస్సులో కూర్చోడానికి సీటు లేక పోవడంతో నిలబడి ప్రయాణించింది. నాగలాపురంలో బస్టాండులో దిగిన తరువాత తన బాగులో ఉన్న పర్సు కనబడటం లేదని గుర్తించింది. బస్సులో పడి ఉండవచ్చని, పర్సులో 3 సవరములు బంగారం, 5 వేలు నగదు ఉందని, పర్సు కనబడటం లేదని కంగారుపడి వెంటనే స్థానిక పోలీసు స్టేషన్లో పిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారిస్తామని పోలీసులు తెలిపారు.

రూ.50 వేలకు సరుకు కొని డబ్బులివ్వకుండా పరార్



ప్రజాశక్తి - నాగలాపురం: యాభై వేల రూపాయలకు సరుకు కొని డబ్బులివ్వకుండా ఓ గుర్తు తెలియని వ్యక్తి పారిపోయిన ఘటన నాగలాపురం మండలంలో శనివారం చోటు చేసుకుంది. షాపు యాజమా తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని స్థానిక వీ.కె.ఎం వీదిలో గల నీలకంటం ఎంటర్ప్రైసస్ (రాదేశ్యామ్) దుఖాణంలో శనివారం ఓ గుర్తు తెలియని వ్యక్తి రూ.50 వేలుకు కరెంటు సామగ్రి కొన్నాడు. షాపు యాజమాని బిల్లు వేసిన తరువాత వినియోగదారుడు ఫోన్పే, గూగుల్ పే పని చేయలేదని చాలా సేపు ఏమార్చి, కొద్ది సేపు తరువాత షాపులో పనివాడిని తనతో పంపించమని చెప్పి అతన్ని తన ద్విచక్ర వాహనంలో బైటకొడియంబేడు ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వరకు తీసుకెళ్ళి 5 నిమిషాలలో తమ ఓనర్ వద్ద డబ్బులు తీసుకొస్తానని చెప్పి పారిపోయాడు. పారిపోయిన వ్యక్తి ఆదివారం వరకు తిరిగి రాకపోవడంతో షాపులోని సీసీ పుటేజస్ ఆధారంగా షాపు యాజమాని స్థానిక పోలీసు స్టేషన్లో పిరుర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసుల తెలిపారు.

ముక్కంటి భక్తుల ఫైర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం జరిగిన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవం కారణంగా భక్తులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఆలయాధికారులకు ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో భక్తులు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేశారు. ఈ క్రమంలోనే కూటమి నేతలు వందలాదిగా ఆలయానికి తరలిరావడంతో మధ్యాహ్నం 12.30 గంటలకు భక్తులను క్యూ లైన్లలో ఆపేశారు. దీనిపై భక్తులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం సమయంలో ప్రమాణ స్వీకారం ఏమిటని భక్తులు ప్రశ్నించారు. ఓ భక్తుడైతే సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ డబ్బుతోనే రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డాడు. తిరుమల, శ్రీకాళహస్తి ఆలయాల్లో భక్తికి బదులు డబ్బే రాజ్యమేలుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ వైపు హిందూత్వం తారా స్థాయికి చేరి భక్తులను ఆలయాలకు దూరం చేస్తోందంటూ ధ్వజమెత్తారు.

తహశీల్దారు కార్యాలయం పరిశీలన

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): శిథిలవస్థకు చేరుకున్న మండల తహశీల్దార్ కార్యాలయాన్ని ఆదివారం తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యాలయ భవనాన్ని నిర్మించి చాలా కాలం అయినందున వర్షం వస్తే కార్యాలయం మొత్తం ఎక్కువగా ఉరుస్తున్న కారణంగా ఈ కార్యాలయాన్ని సమగ్ర శిశు పథక కార్యాలయ భవనంలోకి మార్పు చేసి కార్యకలాపాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కలెక్టర్ సందీప్ రఘువంశి, ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, మండల తాసిల్దార్ భారతి, డిప్యూటీ తాసిల్దార్ జీవన్, డి.ఎల్.డి.ఓ సుస్మిత, ఎం.పీ.డీ.వో సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేష్ మృతికి నివాళి



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): మండల పరిధిలోని కొణతనేరి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గంగయ్య కుమారుడు శనివారం రాత్రి మల్లవరం ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు గాలి మురళి నాయుడు ఆది వారం కొణతనేరి గ్రామానికి వెళ్లి వెంకటేష్ భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం ఇరు పార్టీల నాయకులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని తెలిపారు. అలాగే శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, తొట్టంబేడు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రావిళ్ల మునిరాజా నాయుడు చరవాణి ద్వారా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇరు పార్టీల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చెవిరెడ్డి హర్షిత్ రెడ్డికి అభినందనలు

ప్రజాశక్తి - క్యాంపస్: వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌లను నియమించారు. జోన్-4 కింద ప్రకాశం, ఎస్‌పీఎస్ నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిని నియమించారు. ఆ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడటంతో పలువురు పార్టీ నేతలు, విద్యార్థి విభాగం నేతలు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

ముక్కంటి సాక్షిగా ధర్మకర్తల మండలి ప్రమాణం

ఆలయ ప్రతిష్టతను రెట్టింపు చేస్తామని ప్రతిజ్ఞ



సంతకం చేస్తున్న చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులతో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పార్వతీ పరమేశ్వరుల సాక్షిగా ముక్కంటి ధర్మకర్తల మండలి కొలువు దీరింది. స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజి గణపతి ఆలయం వద్ద ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ధర్మకర్తల మండలి చైర్మన్‌గా కొట్టే సాయి ప్రసాద్ ప్రమాణం చేశారు. అనంతరం 14 మంది బోర్డు సభ్యులు, ఇద్దరు ఆహ్వానితులు ప్రమాణం చేయడం జరిగింది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రతిష్ఠ మరింత రెట్టింపయ్యేలా తమ వంతు ధర్మాన్ని నిర్వర్తిస్తామని ధర్మకర్తల మండలి సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి, ఈవో బాపిరెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ సమక్షాన ధర్మకర్తల మండలి సభ్యులు ప్రమాణం చేశారు. అనంతరం ఆలయ పరిపాలనా భవనంలో చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్‌తో పాటు సభ్యులు, ఆహ్వానితులు బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వీరికి దిశా నిర్దేశం చేశారు. సమిష్టి నిర్ణయాలతో ఆలయ పురోభివృద్ధికి దోహదపడాలని సభ్యులకు సూచించారు. ముక్కంటి సేవ చేసుకునే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నాననీ, తన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చి శ్రీకాళహస్తీశ్వరాలయానికి, ధర్మకర్తల మండలికి మంచి పేరు తీసుకొస్తానని చైర్మన్ సాయి ప్రసాద్ తెలిపారు. వందలాదిగా టిడిపి, జనసేన, బిజెపి, నేతలు పాల్గొన్నారు.